

కాంగ్రెస్ కార్పొరేటర్ వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న సర్దార్ కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ఆయన ఇద్దరు పిల్లలకు రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 10 లక్షల ఆర్థిక సాయాన్ని అందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# వ్యక్తిగత గోప్యత నా హక్కు

మొదటిపేజీ తరువాయి...

బీఎన్ఎస్ఎ సెక్షన్ 94 ప్రకారం ఏసీబీ తనకు మరో నోటీసును అందించిందని కేటీఆర్ తెలిపారు. అందులో తాను నవంబర్ 1, 2021 నుంచి డిసెంబర్ 1, 2023 వరకు వాడిన మొబైల్ ఫోన్‌ను, ల్యాప్‌టాప్, ట్యాబ్, ఐపాడ్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఏసీబీకి స్వాధీనం చేయాలని నోటీసులో కోరినట్టు పేర్కొన్నారు. అయితే, బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 94 కింద ఇచ్చిన నోటీసులో తాను వాడిన సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎందుకు స్వాధీనం చేయాలనే కారణం కానీ, ఉద్దేశం కానీ స్పష్టంగా పేర్కొనలేదని కేటీఆర్ ఎత్తిచూపారు.

### రికార్డులన్నీ అక్కడే ఉన్నాయి..

ఫార్ములా-ఈ కేసు విచారణకు సంబంధించి అవసరమైన అన్ని రకాల అధికారిక సంప్రదింపుల రికార్డులన్నీ రాష్ట్ర ప్రభుత్వంలోని పురపాలక శాఖ వద్దే ఉన్నాయని కేటీఆర్ స్పష్టంచేశారు. అవన్నీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి హోదాలో తీసుకున్న నిర్ణయాలని తెలిపారు. తనకు వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణల్లో గతంలో వాడిన ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రస్తావన కానీ, సంబంధం కానీ లేనప్పటికీ, వాటిని స్వాధీనం చేయాలని కోరడం అంటే రాజ్యాంగం ఒక పౌరుడిగా తనకు కల్పించిన ప్రాథమిక హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. కేసు దర్యాప్తు కోసం తాను వాడిన ఎలక్ట్రానిక్ వస్తువులు అవసరమనే విషయాన్ని ఎక్కడా కూడా ప్రస్తావించలేదని గుర్తుచేశారు.

### సుప్రీంకోర్టు నిబంధనలు పాటించాలి

విచారణలో భాగంగా ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించాల్సి వస్తే.. సుప్రీంకోర్టు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని కేటీఆర్ తెలిపారు. ఒక వేళ ప్రత్యేక పరిస్థితుల్లో సేకరించే ఎలక్ట్రానిక్ వస్తువులను విచారణ సంస్థల అధికారులు ట్యాంపర్ చేయకుండా ఉండేందుకు కఠిన నిబంధనలను పాటించాలని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. వ్యక్తిగత గోప్యతతోపాటు, విచారణ పేరుతో ఒక పౌరుడి నుంచి ఎందుకు తీసుకుంటున్నారు? అనే సరైన కారణం చెప్పకుండా, సేకరించిన సమాచారాన్ని ఆయనకే వ్యతిరేకంగా వాడడం సరైనది కాదు అనే 'రైట్ అగైనెస్ట్ సెల్ఫ్-ఇన్‌క్రిమినేషన్' అనేవి అత్యంత ముఖ్యమైనవని, వాటికి భంగం కలగకుండా ఉండేందుకే ఈ జాగ్రత్తలు సూచించిందని గుర్తుచేశారు.

#### 2024లోనే ఫోన్ మార్చాను..

ఇదే అంశంలో రిట్ పిటిషన్ దాఖలు చేసిన పిటీషనర్‌కు సుప్రీంకోర్టు ఉపశమనం ఇచ్చిన విషయాన్ని కేటీఆర్ తన లేఖలో ప్రస్తావించారు. ఆ కేసులో రెస్పాండెంట్‌గా ఉన్న ఈడీకి, పౌరుడి మొబైల్ ఫోన్‌ను వాడటంకానీ, అందులోని సమాచారాన్ని కాపీ చేయవద్దని కూడా స్పష్టంచేసిందని కేటీఆర్ గుర్తుచేశారు. వివిధ దర్యాప్తు సంస్థలు విచారణలో భాగం చేసిన ఎలక్ట్రానిక్ వస్తువుల కేసులు అనేకం కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. 2024 మొదటి త్రైమాసికంలో తాను మొబైల్ ఫోన్‌ను మార్చానని, తాను గతంలో వాడిన ఆ పాత ఫోన్ ఇప్పుడు తన దగ్గర లేదని కేటీఆర్ స్పష్టంచేశారు. తాను ఫోన్ కాకుండా ఏ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను వాడలేదని ఈ సందర్భంగా వెల్లడించారు.

# ఫోన్ జప్తు.. గోప్యతను హరించడమే!

- జ్యుడీషియల్ వారెంట్ లేకుండా ఫోన్ తీసుకోవడం కుదరదు
- ఏమైనా ఆధారాలు దొరకొచ్చన్న సాకుతో ఫోన్లు సీజ్ చేయొద్దు
- వ్యక్తుల సమ్మతి తీసుకోకుండా ఫోన్ అన్‌లాక్ రాజ్యాంగ విరుద్ధం
- 'విచారణకు ఫోన్' కేసుల్లో గతంలో సుప్రీం కీలక వ్యాఖ్యలు
- 'లాటరీ కింగ్' కేసులో ఈడీ ఫోన్ల జప్తును తప్పుబట్టిన ధర్మాసనం
- వ్యక్తిగత పరికరాల జప్తు తగదన్న అప్పటి సీజేఐ చంద్రచూడ్



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ఫార్ములా-ఈ కేసు విచారణ సందర్భంగా మాజీమంత్రి కేటీఆర్ మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్‌ను తమకు ఇవ్వాలని ఏసీబీ అధికారులు కోరడం సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది. కోర్టు నుంచి జ్యుడీషియల్ వారెంట్ లేకుండా ఒక వ్యక్తి నుంచి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకొనే అధికారం ఎవరికీ ఉండదని న్యాయ నిపుణులు చెప్తున్నారు. ఒక వ్యక్తి నుంచి ఫోన్, ల్యాప్‌టాప్‌ను బలవంతంగా జప్తు చేస్తే అది ఆ వ్యక్తి గోప్యతను హరించడమేనని అంటున్నారు. దర్యాప్తు సంస్థలు ఒక పౌరుడి నుంచి సేకరించిన సమాచారాన్ని తిరిగి ఆ వ్యక్తిపైనే వాడటం కుదరదని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు.

### ఫోన్లు జప్తు చేయడమేంటి?

ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ (లాటరీ కింగ్) కేసులో శాంటియాగో మార్టిన్, అతని కుటుంబ సభ్యుల ఫోన్లను నిరుడు ఈడీ అధికారులు జప్తు చేశారు. దీంతో మార్టిన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన ధర్మాసనం ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను ఈడీ జప్తు చేయడాన్ని తప్పు బట్టింది. జప్తు చేసిన ఎలక్ట్రానిక్ పరికరాల్లోని సమాచారాన్ని తీసుకోవడం లేదా కాపీ చేయడం వంటి పనులను మానుకోవాలంటూ ఈడీకి సూచించింది. ఇది వ్యక్తిగత గోప్యతను హరించడమేనని వ్యాఖ్యానించింది. మొబైల్ ఫోన్లను అప్పగించాలంటూ మిగతా నిందితులకు జారీ చేసిన సమన్లను వెనక్కి తీసుకోవాలని ఈడీని ఈ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది. గోప్యత అనేది ప్రాథమిక హక్కు అని పునరుద్ఘాటించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పును గుర్తుచేస్తున్న న్యాయకోవిదులు.. ఏసీబీ అధికారులు కేటీఆర్ ఫోన్, ల్యాప్‌టాప్‌ను ఇవ్వాలని కోరడం కూడా వ్యక్తిగత గోప్యతను హరించడం కిందకే వస్తుందని అంటున్నారు.

### వారెంట్ లేకుండా కుదరదు

చైనా నుంచి నిధులు వస్తున్నాయన్న అభియోగాలతో 2023లో 'న్యూస్‌క్లిక్' ఆఫీసులో ఢిల్లీ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో సంస్థలో పనిచేస్తున్న జర్నలిస్టుల ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్‌ను కూడా జప్తు చేశారు. దీన్ని సవాల్ చేస్తూ జర్నలిస్టులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో అత్యున్నత ధర్మాసనం కొన్ని డ్రాఫ్ట్ గైడ్‌లైన్స్‌ను జారీ చేసింది. కోర్టు నుంచి జ్యుడీషియల్ వారెంట్ ఉంటేనే వ్యక్తిగత ఎలక్ట్రానిక్ పరికరాలను జప్తు చేసే అవకాశం ఉంటుందని అందులో పేర్కొంది. అత్యవసర పరిస్థితుల్లో వారెంట్ లేకుండా ఒకవేళ ఫోన్లను జప్తు చేసినట్లయితే, వారెంట్ తీసుకోకపోవడానికి గల కారణాలను రికార్డు చేయాలని వెల్లడించింది. ఏమైనా ఆధారాలు దొరకవచ్చన్న సాకును చూపిస్తూ ఎలక్ట్రానిక్ పరికరాలను జప్తు చేయకూడదని వివరించింది. కేసులో నిందితుడు మినహా ఈ సూత్రం అందరికీ వర్తిస్తుందని వెల్లడించింది. మరోవైపు, సంక్షేమ పథకాలకు ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం తీసుకొన్న నిర్ణయంపై దాఖలైన పిటిషన్‌ను 2017లో సుప్రీంకోర్టు విచారించింది. వ్యక్తిగత గోప్యత రాజ్యాంగపరమైన హక్కు అని స్పష్టం చేసింది. ఆధార్ అనుసంధానం వ్యక్తిగత గోప్యతను హరిస్తున్నదని తేల్చిచెప్పింది.

### సమ్మతి తప్పనిసరి

ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను జప్తు చేసిన తర్వాత అందులోని సమాచారాన్ని వెలికితీయాలనుకొంటే దానికి ఫోన్ యజమాని సమ్మతి తప్పనిసరి అని ఢిల్లీకి చెందిన న్యాయ నిపుణులు సూరజ్ తెలిపారు. ఫోన్‌ను అన్‌లాక్ చేయాలంటే ఫోన్ యజమాని అనుమతి తీసుకోవాలని, ఒకవేళ అలా చేయకపోతే అది ఆర్టికల్ 21 ప్రకారం గోప్యతాహక్కును ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఈ మేరకు జస్టిస్ కేఎస్ పుట్టస్వామి వర్సెస్ కేంద్రం (2017) కేసులో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. మొబైల్ ఇవ్వాలంటూ దర్యాప్తు అధికారి ఎవరినైనా బలవంతంగా అడిగినట్లయితే అది ఆర్టికల్ 20(3) ప్రకారం మౌలిక హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని మరో న్యాయవాది సుధీర్ వర్మ తెలిపారు. దర్యాప్తు సంస్థలు ఒక పౌరుడి నుంచి సేకరించిన సమాచారాన్ని తిరిగి ఆ వ్యక్తిపైనే వాడటం కుదరదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొత్తంగా ఫోన్, ల్యాప్‌టాప్‌ను ఇవ్వాలంటూ మాజీమంత్రి కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు కోరడం.. గోప్యతా హక్కులను కాలరాయడం కిందికే వస్తుందని న్యాయనిపుణులు చెప్తున్నారు.

## హైకోర్టుకు దరిపల్లి భూబాధిత రైతులు

- తమ భూములు తమకు అప్పగించాలని పిటిషన్
- కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆరోపణ

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): సిద్దిపేట జిల్లా దరిపల్లిలోని సర్వే నంబర్-294 వివాదాస్పద భూములపై రైతులు కోర్టును ఆశ్రయించారు. వారసత్వంగా వస్తున్న సదరు అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చి.. తమ భూములు తమకు అప్పగించాలని కోరారు. ఈ మేరకు హైకోర్టు రైతుల పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. లావుణి పట్టాలున్న తమ భూములను డెవలప్‌మెంట్ పేరుతో కొందరు నాయకులు సేకరించి అక్రమంగా పట్టాలు చేయించుకుని తమను భూముల్లోకి వెళ్లనీయడం లేదని రైతు లచ్చపేట ముత్తగౌడ్‌తోపాటు మరో 19 మంది రైతులు కోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు డబ్ల్యూపీ 16161 నంబర్ ఇచ్చి రైతుల వద్ద ఉన్న పూర్తి డాక్యుమెంట్ ఎవిడెన్స్ కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది.

### ఇదీ నేపథ్యం..

దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట్-భూంపల్లి మండలంలోని దరిపల్లిలో సర్వే నంబర్-294లో 178.05 ఎకరాల భూమి ఉన్నది. సేత్వార్, కాస్రా పహణి రెవెన్యూ రికార్డుల్లో ఈ మొత్తం ప్రభుత్వ భూమిగా ఉన్నది. ఇందులో 294/1 నుంచి 294/3 వరకు ఉన్న 51 ఎకరాలు ఇప్పటికీ ప్రభుత్వ భూమిగానే ఉండగా, 294/4 నుంచి 294/10 సర్వే నంబర్లలో ఉన్న భూమి మాత్రం ప్రైవేటు పట్టాకు ఎక్కినట్టు రికార్డులు చూపుతున్నాయి. ఆ భూమిలో అదే గ్రామానికి చెందిన కుమ్మరి, వడ్డెర సామాజిక వర్గానికి చెందిన కొంతమంది రైతులు చాలాకాలంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ భూములు తమకు వారసత్వంగా అసైన్డ్ పట్టా భూములుగానే వస్తున్నాయని రైతులు చెప్తున్నారు. అసైన్డ్ భూమి అంటే అమ్ముకానికి వీలు ఉండదు. అలా కాకుండా విక్రయిస్తే పీవోటీ యాక్ట్ ప్రకారం స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉన్నది. ఈ భూముల్లోని 74 ఎకరాల వరకు కొంత మంది ప్రముఖ వ్యక్తులు లీజు పేరుతో స్వాధీనం చేసుకుని పట్టా మార్పిడి చేసుకున్నారని రైతులు ఆరోపించారు.

# కుంటయ్య ఆత్మహత్యపై కోర్టుకెళతాం

**సివిల్ మ్యాటర్స్‌లో దూరి పోలీసుల అరాచకాలు**

- న్యాయం కోసం వెళ్తే ఉల్టా కేసు పెట్టి వేధింపులు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు
- మాజీ ఎంపీటీసీ కుంటయ్యకు నివాళులర్పించిన కేటీఆర్



కుంటయ్య కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, జూన్ 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నాయకులు, పోలీసుల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ మాజీ ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్యకు న్యాయం జరిగేవరకు పోరాడుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ మేరకు కోర్టుకు వెళ్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణలోని పోలీస్ స్టేషన్లు సెటిల్‌మెంట్లకు అడ్డాగా మారాయని, సివిల్ తగాదాల్లో పోలీసులు తలదూర్చి అరాచకాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేత భూమి కబ్జా చేశాడని.. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే.. ఉల్టా కేసు పెట్టారంటూ ఆవేదనతోనే కుంటయ్య ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. బుధవారం కుంటయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుంటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కుంటయ్య తన బాధను చెప్పుకోలేదని, చెప్పి ఉంటే ఆదుకునేవాళ్లమని ఆవేదన వ్యక్తంచేశారు. తమ కార్యకర్త మరణానికి కారకులైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని, న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. అన్ని విధాలా ఆదుకుంటామని కుంటయ్య భార్య విజయకు కేటీఆర్ ధైర్యం చెప్పారు. కుంటయ్య కూతుళ్లు భార్గవి (22), దీక్షిత (11) చదువులు, పెళ్లిళ్ల బాధ్యత తాను చూసుకుంటానని భరోసా ఇచ్చారు. నిబద్ధతగల నాయకుడు, నిఖార్సైన గులాబీ సైనికుడు కుంటయ్య లేనిలోటు పార్టీకి తీరనిదని ఆవేదన వ్యక్తంచేశారు. కేటీఆర్ వెంట చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ నేతలు తుల ఉమ, తోట ఆగయ్య, జిందం చక్రపాణి, గజభీంకార్ రాజన్న, బొల్లి రామ్మోహన్, పడిగెల రాజు, కోడి అంతయ్య, అడ్డగట్ల భాస్కర్, కుర్మ రాజయ్య తదితరులు ఉన్నారు.

# బడుగు జీవితాలపై సర్కారు కత్తి

- సిరిసిల్ల జిల్లా రంగంపేట పోడు భూముల్లో ప్లాంటేషన్!
- రంగంలోకి అటవీ అధికారులు
- పట్టాలు లేని వ్యవసాయ భూముల పరిశీలన
- పోడు భూములను గుంజుకునేందుకు స్కెచ్
- అధికారులపై రైతుల ఆగ్రహం
- మొక్కలు పెడితే ఊరుకోబోమని అన్నదాతల హెచ్చరిక



రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం రంగంపేటలో తమ భూముల వద్ద నిరసన తెలుపుతున్న పోడురైతులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, జూన్ 18: బడుగు జీవితాలపై కాంగ్రెస్ సర్కారు కత్తిగట్టింది. ఎవుసమే జీవనాధారంగా బతికే రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం రంగంపేటలోని పేదల నోటికాడి బుక్క ఎత్తగొడుతున్నది. పట్టాలు లేని పోడు భూముల్లో మెగా ప్లాంటేషన్ చేపట్టేందుకు బుధవారం అటవీ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లడంతో పోడు రైతుల కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశారు. తిండి పెట్టే భూముల్లో మొక్కలు పెంచి తమ కడుపు కొడితే ఊరుకోబోమని తెగేసి చెప్పడంతో చేసేదేమీ లేక అధికారులు వెనుదిరిగారు.

### అండగా బీఆర్ఎస్ సర్కారు

రంగంపేటలో 20 ఏండ్లకు క్రితం నుంచే బీసీ, ఎస్సీ, ముస్లిం వర్గాల పేదలు పోడు వ్యవసాయం చేస్తున్నారు. 2005లో అప్పటి ప్రభుత్వం ఎస్టీలు సాగు చేస్తున్న భూములపై సర్వే చేసింది. ఆ తర్వాత 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీలతోపాటు బీసీలు, ఎస్సీలు, ముస్లింలు సాగు చేస్తున్న భూమిపై సర్వే చేసింది. ఆయా వర్గాలకు చెందిన 202 మంది 250 ఎకరాల్లో పోడు సేద్యం చేస్తున్నట్టు గుర్తించి, అందుకు సంబంధించిన మ్యాప్‌ను కూడా తీసుకున్నది. వారిలో 100 మంది ఎస్టీ రైతులకు అదే ఏడాది పట్టాలు పంపిణీ చేయగా.. మిగిలిన వారికి సాంకేతిక కారణాలతో రాలేదు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో పరిస్థితి మారిపోయింది. అధికారంలోకి వస్తే మిగిలిన రైతులకు పట్టాలిస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ నాయకులు.. తీరా అధికారంలోకి రాగానే చేతులెత్తేశారు. పట్టాలు ఇవ్వకపోగా ఉన్న భూమిని గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారు.

### సాగు భూముల్లో ప్లాంటేషన్ ఏంటి?

పట్టాలు లేని భూముల్లో ప్లాంటేషన్‌కు ప్రణాళిక చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఎఫ్ఎస్‌వో పద్మలత బుధవారం తమ సిబ్బందితో కలిసి సాగులో ఉన్న పోడు భూములను పరిశీలించారు. ఆ విషయం తెలుసుకున్న రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టాలిచ్చిన భూమిని ఆనుకుని ఉన్న 100 ఎకరాల పోడు భూమిలో ప్లాంటేషన్ ఎలా చేస్తారని అధికారులను ప్రశ్నించారు. భయంతో రోజంతా అక్కడే కాపుకాశారు. ప్లాంటేషన్ చేయనివ్వబోమని తెగేసి చెప్పడంతో అధికారులు చేసేదేమీ లేక అక్కడి నుంచి వెళ్లిపోయారు.

#### భూములు గుంజుకుంటే చావే దిక్కు



మాకు మూడెకరాలనర భూమి ఉంది. 20 ఏండ్ల నుంచి దున్నుకుంటున్నం. నా భర్త రామస్వామి నాలుగేండ్ల కింద కరోనా టైంల కాలం జేసిండు. ఎవుసం చేసే ముగ్గురు బిడ్డలను సాదుతున్న. సార్లు అచ్చి ఎవుసం జేసే భూమిల సెట్లు పెడ్తమంటే ఎట్ల ఊకుంటం. మా భూమి పక్కనున్నోల్లకు పట్టాలున్నయ్. మాకు ఇంకా రాలేదు. ఇగ వస్తయేమో అనుకునేసరికి ఇట్ల చేత్తున్నరు. మా భూములు గుంజుకుంటే మాకు చావే దిక్కు

- బొజ్జ మణవ్వ, పోడురైతు, రంగంపేట, వీర్నపల్లి

#### మా భూములు మాకే గావాలె



మాకు ఎక్కడ భూముల్లేవు. ఇక్కడ 30 ఏండ్లయింది దున్నుకోవట్టి. ఏదో ఇక్కన్నే కష్టపడి మక్కలు, జొన్నలు పండిచ్చుకున్నం. ఈడికి నేను 60 నుంచి 70 ఏండ్లున్న. బతుకుదెరువు సూపే భూమిల సెట్లు పెడ్తమని వచ్చిర్రు. అట్ల జేత్తే మేం సేండ్ల మందుతాగి ఎవల సేన్ల వాల్లం సచ్చిపోతం. మేమైతే ఇక్కడ సెట్లు పెట్టనియ్యం.

- పొన్నం లక్ష్మి, పోడురైతు, రంగంపేట, వీర్నపల్లి

#### 2005కు ముందున్నదే లెక్క



రంగంపేటలో అటవీభూమి విషయంలో పోడు రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. 2005కు ముందు సాగులో ఉన్న భూమిలో పట్టా ఇచ్చిన భూముల హద్దులు నిర్ణయిస్తాం. అలాగే హక్కు పత్రాలు రాని వారు కూడా 2005కు ముందే సాగులో ఉంటే టైంలైన్ మ్యాప్ ఆధారంగా గుర్తించి, హద్దులు నిర్ణయిస్తాం. ఆ తర్వాత కాలంలో డిస్టర్బ్ అయిన అటవీ భూమిని మాత్రం స్వాధీనం చేసుకుంటాం.

- శ్రీహరిప్రసాద్, ఎఫ్ఆర్‌వో, సిరిసిల్ల

# పోలీసు పహారా మధ్య తిమ్మాయపల్లి భూముల సర్వే

- 365 ఎకరాల అసైన్డ్ భూములు ప్రభుత్వం స్వాధీనం
- ఇండస్ట్రియల్ పార్కుల కోసం సేకరిస్తున్న సర్కార్
- ఎంజాయ్‌మెంట్ సర్వేకు కొంతమంది రైతులు దూరం



సర్వే కోసం మోహరించిన పోలీసులు

రంగారెడ్డి, జూన్ 18 (నమస్తేతెలంగాణ) : ఇండస్ట్రియల్ పార్కుల కోసం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాయపల్లి గ్రామంలో ప్రభుత్వం పోలీసు పహారా మధ్య ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రారంభించింది. సర్వే నంబర్ 9లో 365 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో పేదలకు కేటాయించి పట్టాలిచ్చారు. సుమారు 150 మందికి పైగా రైతులు ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ భూములు ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్కుకు సమీపంలో ఉండటంతో సర్కార్ కన్నేసింది. ఈ భూములు ఇవ్వడానికి కొంతమంది రైతులు అంగీకరించటంతో ఎంజాయ్‌మెంట్ సర్వే చేస్తున్నారు. కానీ కొందరు రైతులు ఈ సర్వేకు దూరంగా ఉన్నారు. సుమారు 30 వేల ఎకరాల్లో పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. కానీ 14వేల ఎకరాలను ఫార్మాసిటీకోసం సేకరించిన భూములతోపాటు అదనంగా మరో 16 వేల ఎకరాలను సేకరించే పనిలో పడింది. అందులో భాగంగానే తిమ్మాయపల్లిలోని సర్వే నంబర్ 9లోని 365 ఎకరాలను తీసుకోవాలని నిర్ణయించింది. ఎకరాకు రూ.37 లక్షలు రైతులకు ఇస్తామంటూ అధికారులు సర్వే చేస్తున్నారు. సర్వేచేస్తున్న నేపథ్యంలో పోలీసులను పెద్ద ఎత్తున మోహరించారు.

# తొలుత పరిశ్రమలు.. ఆనక నివాసాలు!

- మరో 193 ఎకరాల అసైన్డ్ భూములకు ఎసరు
- సంగారెడ్డిలో నాయకులు, రియల్టర్ల కుమ్మక్కు
- ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో భూసేకరణ నోటిఫికేషన్
- ఇదివరకే 2109 ఎకరాల సేకరణకు ఉత్తర్వులు



హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): కొందరు అధికారపార్టీ నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కలిసి కంపెనీల పేరుతో విలువైన భూములను చేజిక్కించుకునేందుకు హైడ్రామాకు తెరలేపారు. వారు ప్రభుత్వం భూసేకరణ చేయనున్నదని రైతులను భయభ్రాంతులకు గురిచేసి వారినుంచి భూములను కొట్టేసేందుకు పకడ్బందీ పథకాన్ని అమలు చేస్తున్నారని స్థానికంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో ఈ వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో 193ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మూడు నెలల్లో మూడోసారి భూసేకరణ నోటిఫికేషన్ జారీచేయడం ఈ ఆరోపణలకు బలాన్నిస్తున్నది. గతంలో ఏపీఐఐసీ ఏర్పాటుచేసిన పారిశ్రామికవాడలు ఇప్పుడు జనావాసాలుగా మారినట్టే మళ్లీ అదే తరహా కుయుక్తికి తెరతీసినట్టు తెలుస్తున్నది.సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆరూర్ గ్రామంలో 134 మంది రైతులనుంచి 193.14ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించేందుకు బుధవారం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ భూములను పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం సేకరిస్తున్నట్టు తెలిపింది. ఈ భూములపై ఎటువంటి క్రయవిక్రయాలు, లావాదేవీలు జరపరాదని, అభ్యంతరం ఉన్నవారు 60 రోజుల్లోగా కలెక్టర్ లేక ఆర్డీవో కార్యాలయంలో తమ అభ్యంతరాలను నమోదు చేయవచ్చని కోరారు. ఇదిలావుండగా, గత నెల ఒకటిన నిమ్జ్ కోసం సంగారెడ్డి జిల్లా న్యాలకల్ మండలంలోని గుంజేటి, మామిడిగి, గణేశ్‌పూర్ తదితర గ్రామాల పరిధిలో దాదాపు 800 మంది రైతులనుంచి 1456 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. మూడు నెలల క్రితం కూడా న్యాలకల్ మండలం హుసెల్లి గ్రామం పరిధిలో 491 మంది రైతుల నుంచి 653.08 ఎకరాలు సేకరించేందుకు నోటిఫికేషన్ జారీచేసింది. ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే 2,302ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసింది.

### అసలు కథ ఇది...!

ఈ భూసేకరణ వెనుక కథ వేరే ఉన్నదని స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. సంగారెడ్డి జిల్లాలో భూముల విలువ భారీగా పెరగడంతో రియల్ ఎస్టేట్ రంగం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతున్నది. దీంతో స్థానిక అధికారపార్టీ నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమ్మక్కై ఈ విలువైన భూములను చేజిక్కించుకునేందుకు పక్కా వ్యూహాన్ని అమలు చేస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. అందులో భాగంగానే వారి కన్ను పడిన భూముల్లో పారిశ్రామికవాడ వస్తున్నట్టు, త్వరలో ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ జారీచేయనున్నట్టు ముందుగా ప్రచారం చేస్తారు. అనంతరం భూ యజమానులతో ధర మాట్లాడుకుంటారు. ధర నిర్ణయం అయ్యాక.. అనుకున్నట్లుగానే ప్రభుత్వం నుంచి భూసేకరణ నోటిఫికేషన్ జారీ అవుతుంది. ప్రభుత్వం ఎకరాకు సుమారు రూ.10-15లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించనుండగా, వీరు కూడా ముందు మాట్లాడుకున్న విధంగా ఎకరాకు కొంత ముట్టజెప్తారు. అనంతరం టీజీఐఐసీ కంపెనీల పేరుతో వారు కోరుకున్న కంపెనీకి భూములను కేటాయిస్తుంది. మొదలు కంపెనీ పేర భూకేటాయింపు జరుగగా, అనంతరం కంపెనీ దివాళా తీసిందనే కారణంతో అక్కడ రియల్ ఎస్టేట్ టవర్లు ఏర్పడతాయి. ఒకవేళ అవి అసైన్డ్ భూములైతే వారికి రెట్టింపు లాభం వస్తుందని స్థానికులు చెప్తున్నారు. అసైన్డ్ భూములు ఇతరుల పేర రిజిస్ట్రేషన్ జరిగే అవకాశం లేనందున ముందుగా ధర మాట్లాడుకొని వారి పట్టాలను ప్రభుత్వానికి సరెండర్ చేయిస్తారు. పట్టా భూములకన్నా అసైన్డ్ భూముల యజమానులకు కొంత తక్కువ ధర చెల్లిస్తారని, ఈ భూముల ద్వారా వారికి ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు చెప్తున్నారు.

### సంగారెడ్డిలో ఆకాశాన్నంటుతున్న భూముల ధరలు..

సంగారెడ్డి, పటాన్‌చెరు తదితర ప్రాంతాలు ముంబై హైవేకు ఆనుకొని ఉండటం, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో ఇక్కడ భూముల ధరలు భారీగా పెరిగాయి. మారుమూల ప్రాంతాల్లో సైతం ఎకరాకు రూ.50 లక్షలకు తక్కువలేదని, హైవేకు సమీపంలో ఉంటే మాత్రం ధర కోట్లల్లో పలుకుతున్నదని స్థానికులు చెప్తున్నారు. లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విలాసవంతమైన విల్లా ప్రాజెక్టులు భారీగా వస్తుండడంతో వ్యవసాయ భూములన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుతున్నాయి. ఫలితంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఈ ప్రాంతం హాట్ కేక్‌లా తయారైందని అంటున్నారు. దీంతో స్థానిక అధికారపార్టీ నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల భూములను తక్కువ ధరలకు చేజిక్కించుకునేందుకు అనేక రకాల కుయుక్తులు పన్నుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ముందు కంపెనీ.. తరువాత రియల్ ఎస్టేట్

సంగారెడ్డి, పటాన్‌చెరు ప్రాంతాల్లో గతంలో ఏపీఐఐసీ ఏర్పాటుచేసిన పారిశ్రామికవాడలు చాలావరకు ఇప్పుడు జనావాసాలుగా మారిపోయాయి. వాటిల్లో బడా అపార్ట్‌మెంట్లు వెలిశాయి. గతంలో కొంతకాలం పరిశ్రమలుగా కొనసాగిన కంపెనీలు ఇప్పుడు కానరాకుండా పోయాయి. ఇందులో ఎక్కువశాతం ప్రభుత్వం నుంచి అరకొర ధరలకు భూములు కొనుగోలు చేసి, పరిశ్రమల కోసం ప్రభుత్వాల నుంచి సబ్సిడీలు అందుకున్న కంపెనీలే ఉన్నట్టు చెప్తున్నారు. ఇదే తరహాలో ఇప్పుడు స్థానిక నేతలు, రియల్ వ్యాపారులు పరిశ్రమల పేరుతో భూములను పొంది అనంతరం రియల్ ఎస్టేట్‌కు ఉపయోగించుకోవచ్చనే వ్యూహంతో ఉన్నట్టు, ఇందులో భాగంగానే వరుస భూసేకరణ నోటిఫికేషన్లు జారీ అవుతున్నట్టు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.